# శారదలేఖలు

సౌభాగ్యవతియగు కల్పలతకు:—

నెచ్చెలీ! ఏమిపెండ్లిండ్లు! ఏమి ఊరేగింపులు! ఏమి కోలాహలము! అన్నివస్తువులకు ధరలు లేచిపోయినవి. గుడ్డల దుకాణములలో సరుకు ఝూడాఅయినది. మార్కెటులో కూరలు శూన్యము. మాసినగుడ్డలతో మాగిపోతున్నామని మొత్తుకొనుచున్నా చాకలివాండ్రు లగ్గసరి అని గుడ్డలుతుకుట మానుకొని పల్లకీమోతలకో పరువులెత్తుచున్నారు. ఇక భజంత్రీల గడబిడ సరేసరి. చంకనుండెడి పొదులు వంకెనువేసి తాళములతో మునిగితేలుచున్నారు. వంటలవారి, పురోహితబ్రాహ్మణులవారి ఆర్జన, అడావిడి చెప్పనక్కరలేదు. కానిమ్ము ఎన్నాళ్లీరొద. దీనితర్వాత వీరందఱికి సుఖస్థితియే గదా! మేళతాళము లింకా కొంతకాలము జీవించియున్నను పల్లకీలకు మాత్రము పూర్తిగా సెలవే. ఇఁక పెండ్లిండ్లకు వెళ్లివచ్చెడి పేరంటాండ్రకు బొత్తిగా తీరుబడిలేదు. ఇల్లుమఱచిపోయినారంటే సందేహములేదు. పెండ్లి, జోడుపెండ్లిండ్లు, పెండ్లిపై పెండ్లి, పెండ్లిలో పెండ్లి. కార్తికమార్గశిరమాసములలో రైలువారికి రాబడి ముక్కాలుమువ్వీసము ఈ పెండ్లివారినుండియే. మదరాసుదక్షిణమహారటా రైల్వే కంపినీవారు క్రిష్టమసుదినములలో కన్నయీ లగ్గసరిలో ఈ పెండ్లిప్రయాణికులకు తక్కువచార్జీలు యేర్పాటుచేసిన ప్రజలకు చాల ఉపకారముచేసిరని కీర్తింపబడెడి వారే; కాని వారాపుణ్యమునకు పాలుపడలేదు.

అయితే యీ పెండ్లిండ్ల ప్రళయములో నాకు తగిలిన పేరంట మొకపెండ్లిదే కాని యీ పెండ్లిండ్లసందడివలన నేను పొందినంత శ్రమ, నిద్రనష్టము మఱియొకరు పొందియుండరు. ఏమందురా? గొప్పరాజవీధిలో మాయిల్లు. మఱియు రాజబాటనానుకొనియే మాయింటి గోడ. చలికి వెఱచి, చూచుటకు విసిగి ఇంటిలో దట్టమైన దుప్పటి ముసుగుబెట్టుకొని పడుకొనినను ఆ యెడతెగని యూరేగింపుల మంగళతూర్యరవములు చెవులలో దూరకుండ నేమి చేయగలను? కాన పెండ్లిండ్లు విరివిగా జరిగిన మార్గశీర్షమాసమంతయు సుఖదమైన సుప్తి నెఱుగను. క్రిందటి వారములో ఒకనాటిరాత్రి ఓపిక పట్టుకొని వచ్చిన యూరేగింపు నెల్ల చూడవలెనని సంకల్పించుకొంటిని. నా పంతము చెల్లలేదు. అఱగంటలో అయిదు పూరేగింపులు వచ్చెను. ఒక ఊరేగింపుచూచి లోనికి

వచ్చి మంచముపై మేనువాల్చితినో లేదో మరల నింకొక పెండ్లివారి యూరేగింపులోని పెద్దబూరగల బూరటింపు చెవులు చిల్లులు పడజేసెడిది. మరల దానిని చూచివచ్చునప్పటి కింకొకదాని బం,భం, బూ, బూ, అను ధ్వనులు వినవచ్చెడివి. ఎంతచూడగల వేడుకలైనను ఒకటి రెండయిన ముచ్చటగాని రే మెల్ల నదియే రౌద్రమైన విసుగే కాకుండ అసహ్యముగూడ గలుగుట ఆశ్చర్యమా! ఇక చూడజాలనని పంతము విడిచి పడుకొంటిని. కాని విరామ మెఱుగని మేళతాళములవలన నిద్రకుమాత్ర మవకాశము లేకపోయినది. ఆఒక్కనాడేగాదు. మార్గశీర్ష మంతయు నిట్టి జాగారముల తోడనే గడచినది. అమావాస్య వచ్చినది. "నేడమావాస్య. రాబోవునది శూన్యమాసము. ఇక మేళతాళముల గోడవ యుండదు; ఈ నాడైన సుఖముగా నిద్రింత"మని పడుకొంటిని; కాని ఆ రాత్రి కూడా నాగాలేదు. ఒక వూరేగింపురానే వచ్చినది. ఆ పిల్ల మూడేండ్లు నిండియుని:డని పసికూన. కట్టుకొనిన క్రొత్తపరికిణి మెత్తిమెత్తి దులుపుకొనుచు, తొడుగుకొనిన పట్టుచొక్కాను పట్టిపట్టి చూచుకొనుచు బొమ్మల పెండ్లిండ్లలోని బొమ్మవలె కూర్చున్నది. పెండ్లికొడుకో పదేండ్లవాడు. నిద్రచే తూగుచున్నాడు. మతిమాలిన తలిదండ్రులు తమపై వైచిన సంసారభారము నా బాలదంపతులెఱుగరుగా? బహుశః యీ వైవాహికోత్సవము గూడ వారికి జ్ఞాపకముండదు. కాని యీ తంతువలన కలుగబోయెడి కష్టనష్టములకు మాత్రము వారు బాధ్యులు. అకటా! ఎట్టి ఘోరతరాన్యాయము. తలచిన మనస్సు క్షోభజెందుచున్నది. దానితరువాత మఱినాలుగుదినముల కొకయూరేగింపు వచ్చుచున్నది. ఆ వధూవరులిరువురు సరిగా మెనిమిదేండ్లవారు. పిల్లవాడు నల్లనొఖమల్ లాగు కోటు వేసికొని యున్నాడు. పిల్లకొక పెద్దచీర చుట్టబెట్టి పొదలకమ్మవలె కూర్చుండ బెట్టినారు. ఆ బాలిక యీ చీరలోబడి చిక్కములో పిట్టవలె కొట్టుకొనుచున్నది. రానున్న శాసనమువలని భయముచే సనాతనధర్మపరులలో కొంతసంస్కారము కలిగినది. ఏమన తిథిదోషములు, వారపు పట్టింపులు, శూన్యము, మౌఢ్యమాదిగాగల నిషేధములు యీయేటి పెండ్లిండ్లలో కానరావు. ఆపద్ధర్మముగా యీసంస్కారమునకు శాస్త్రి మొప్పినదట. పాపము మన శాస్త్రములు చాలమంచివి. ఎవరి కేవీలుగావలెననినను దానికనుగుణ్యమగు నుదాహరణశ్లోకమును జూపి పూర్వాచారపరాయణుల రక్షించును. ఆ కల్పవృక్షము ప్రాపున వారుచేయని సాహసములేదు. పసిబాలలకు పరిణయములు చేసిరి. కనుగందులను గూర్చుండబెట్టి గర్భాదానమంత్రములను వల్లెవేయించిరి. పానుపు వేయించిరి. మిథునవిడియము లిప్పించిరి. బొమ్మ నప్పగింపజేసిరి. ఇట్టివివాహము లొకటియా? రెండా? మాసములలో నుత్తమమైన యీ శుక్లసంవత్సరమార్గశిరమాస

206

మంతయు నిట్టి శిశువివాహములతో కళంకితమై పోయినది. మన మంగళాద్రి నృసింహుడేమి; తిరుపతి వేంకటేశ్వరుడేమి; సింహాద్రియప్పన్న యేమి యీమాసములో తమ సన్నిధానమున నెన్ని శిశుకల్యాణములు జరిపించిరో లెక్కలేదు. రాళ్లు దేవుళ్లయిన రాసులు మ్రింగవా యని వేమనయోగీంద్రుడు సందేహించినట్టుగనే యీ శిశువివాహములలో దేవుళ్లు రాళ్లయినారు. లేకున్న ఆయా స్వామివారల సన్నిధానమున తల్లిదండ్రు లిట్టి యక్రమ వివాహములు జరుప గలిగియుందురా?

కల్పలతా! నాకీ పెండ్లిండ్ల గడబిడ చూచిన మనవారి మౌఢ్యమునకు మహాశ్చర్యమగుచున్నది. చేజిక్కి పసిబిడ్డలకు వివాహములు చేసినంత మాత్రమున శారదాచట్టమునుండి వీరెట్లు రక్షింపబడిరి? ఇక సృష్టి ఆగిపోవునా? ఆడుపిల్లలు పుట్టరా? పెండ్లిండ్లు కావా? అయ్యో? ఎంత చేదస్తులు. 'మనమీ పిల్లలకు వివాహము చేసినమాత్రమున నేమైనది? ఎట్లు కావలసినదట్లగు' నని వీరేల స్థిమితహృదయులు కాగూడదు? పాపము! తమ తమ ఆతురతకొలది పసిబిడ్డల గొంతులు కోయుచున్నారు గదా! కల్పలతా! ఏ స్త్రీల యభ్యుదయముకొఱకై యీ శారదాచట్టము సృష్టింపబడినదో ఆ స్త్రీల నీ రెండుమూడు మాసములలో జరిగిన యక్రమపు వివాహముల క్లేశ మర్ధశకాబ్దము పీడించును. ఇప్పుడవిమర్శకముగా పెండ్లి చేయబడిన యీ బాలదంపతులు పెద్దవారైన వెనుక అప్పుడు జరుగుచున్న ప్రౌఢవివాహముల గని కుతూహలమత్తులై తమ దాంపత్యములను చిందఱవందఱ చేసికొనినచో నప్పుడీ పరమశ్రోత్రియులగు తలిదండ్రులేమి చేయుదురో? నేడు నవనాగరికులు సైతము 'కూడునా, కూడదా' యని శంకించుచున్న 'డైవోర్సుచట్టము'ను ఆనాడీ శ్రోత్రియసంఘమువారే ఆడుబిడ్డల ఘోషచూడలేక ఆహ్వానింపవలసి వచ్చునేమో గదా? దేశకాలపాత్రములను గుర్తింపక తొందరపడుట యెందును లాభకారిగాదు. నేడు శిశువివాహములకు సహాయభూతులై శారదాచట్టమునకు వ్యతిరేకప్రచారముగావించుచున్న శ్రోత్రియంమన్యు లీవిషయమును గమనింపకుండుట విచారకరమే గాదు ముందున కపాయకరముగూడ నగును సుమా.

కాని విశ్వరక్షకుడైన పరమేశ్వరుని ఈ శిశువధూవరుల కెట్టి బాలారిష్టములు కలుగకుండ రక్షింపుమని ప్రార్థించుటకంటె మనమిక నిప్పుడేమి చేయగలము?

కల్పలతా! నేను జనవరిమాసమున వ్రాసిన లేఖలో నుదాహరించిన గీతాశ్లోకము తారుమారుగా నున్నది. అది యిట్లుండవలెను.

"యద్యదాచరతి శ్రేష్ఠస్తత్త దేవేతరో జనః
సయత్ప్రమాణంకురుతే లోకస్తదనువర్తతే."

భావపురి
౫–౨–౩౦

మిత్రురాలు
శారద.